క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి పొంగళ్లు


ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండి

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం పంచాయతీ చవటపల్లి గ్రామంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి బండ్ల పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో గ్రామస్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పీఎం మన్‌కీ బాత్ వీక్షణ


ఆత్మకూరులో మన్‌కీ బాత్ వీక్షిస్తున్న పట్టణవాసులు

ఆత్మకూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆత్మకూరు నుంచి పలువురు స్వయంగా వీక్షించారు. జేఆర్‌పేటలోని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.

ఏవీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా భానుప్రకాష్


భానుప్రకాష్

జలదంకి: ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్) ఉదయగిరి నియోజకవర్గ కన్వీనర్‌గా జలదంకి మండలంలోని జమ్మలపాళేనికి చెందిన బుర్రి భానుప్రకాష్‌ను ఏవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ తురకా ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. భానుప్రకాష్‌కు పలువురు విద్యార్థి నాయకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకయ్యనాయుడిని కలిసిన నేతలు



ఆత్మకూరు: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని హైదరాబాదులోని ఆయన నివాసంలో ఆత్మకూరు బీజేపీ నాయకులు కలిశారు. ఆదివారం వెంకయ్యనాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్యనాయుడిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, సుధాకర్, కంచి పరమేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అండగా ఐకేర్ మిషన్


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

జలదంకి: ఐకేర్ మిషన్ పేద విద్యార్థులకు అండగా నిలుస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. జలదంకిలోని గిరిజనకాలనీలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు అనిత, అనిల్‌లకు వారి చదువుల నిమిత్తం ఆదివారం రూ.10 వేలు శ్రీనాథ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఐకేర్ మిషన్ సభ్యులు పెట్లూరి ప్రభాకర్, కమతం బాలకోటయ్య, మాతిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో టీచర్ ఉద్యోగాలు

అల్లూరు: తల్లిదండ్రులు లేని పిల్లల కోసం అల్లూరు మండలంలోని నార్తు ఆములూరు గోళ్లపాళెం గ్రామంలో చైల్డ్ ఆశ్రమ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రెండో సెక్షన్ ప్రారంభించిన నేపథ్యంలో బాలికల సెక్షన్ కోసం ఉపాధ్యాయురాలు తెలుగు-1, బాలుర సెక్షన్ కోసం పురుష ఉపాధ్యాయులు గణితం-1, సోషల్ స్టడీస్-1 కావాలని, ఆసక్తి గల వారు ఆశ్రమ పాఠశాల కరస్పాండెంట్ రామచంద్ర శరత్‌బాబును సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

అడుగడుగునా గొయ్యి

అధ్వానంగా రోడ్లు

- గుంతలతో ప్రయాణం నరకప్రాయం
- మరమ్మతుల కోసం ఎదురుచూపు


దెబ్బతిన్న వింజమూరు-చాకలకొండ రోడ్డు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పలు మార్గాల్లో ప్రయాణం అంటే వాహనదారులు, ప్రయాణికులు హడలిపోతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు నాణ్యత లేక క్రమంగా దెబ్బతిన్నాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసి టెండర్లు నిర్వహించింది. అంతలోనే ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు జరగలేదు. కొత్త ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నాణ్యత లేకపోవడంతో..

వింజమూరు-ఆత్మకూరు మార్గంలో ఆత్మకూరు నుంచి రాజవోలు వరకు మాత్రమే వేసిన డబుల్ రోడ్డు రోడ్డు నాణ్యత లేకపోవడంతో అప్పుడే దెబ్బతింది. దీంతో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం రోడ్డుపై చెత్త వేస్తుండడంతో వాహనాల రాకపోకలు చేసే సమయంలో దుమ్ముతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. బీటీ రోడ్డు వెంటనే వేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వింజమూరు నుంచి ఆత్మకూరు వరకు కేవలం 25 కిలోమీటర్ల దూరమే అయినా ప్రయాణం గంటకు పైగానే సమయం పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో వేగంగా వెళ్లే పరిస్థితి లేదని వాపోతున్నారు.

అధ్వానంగా..

వింజమూరు నుంచి చాకలకొండ వరకు రోడ్డు మరీ అధ్వానంగా ఉంది. ముఖ్యంగా వింజమూరు బీసీకాలనీ నుంచి రాగిపాడు, కాటేపల్లి, మాధవ్‌నగర్ వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ మార్గంలో పామూరు, ఇస్కదామెర్ల వైపు ఎక్కువగా ప్రయాణకులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో రాకపోకలు కష్టతరంగా మారాయి. వింజమూరు నుంచి గుండెమడగల, కాటేపల్లి బీసీకాలనీ, గొట్టిగుండాల వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

అందుబాటులో నిధులు

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఏడాది చాకలకొండ రోడ్డు మరమ్మతులకు రూ.1.60 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు నిర్వహించింది. గుండెమడగుల రోడ్డు మరమ్మతులకు కూడా రూ.16.50 లక్షల నిధులు మంజూరు చేసింది. అధికారులు వెంటనే మరమ్మతులపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ ఫయాజ్ మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

డాక్టర్లు దైవంతో సమానం

- ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలి: ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులు దైవంతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో ముసునూరులోని ఐఎంఏ కార్యాలయంలో పట్టణంలోని వైద్యులు ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యుల సేవలను కొనియాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్యసేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలంతా వైద్యులకు రుణపడి ఉంటారన్నారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో రక్తహీనతకు చెక్


సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

అల్లూరు: చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కె.సౌజన్య, సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి తెలిపారు. స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలోని అగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత రాకుండా ఉండాలంటే చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలను ప్రతి రోజూ తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, అవి తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చని తెలిపారు. డయేరియా దరిచేరకుండా ఉండాలంటే ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శుద్ధమైన తాగునీరు తాగాలని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లో 15 మంది పిల్లలు ప్రీస్కూల్ పూర్తి చేసుకొని 5 సంవత్సరాలు నిండిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ప్రమీల, రమమ్మ, ఆశా కార్యకర్తలు లలితమ్మ, త్రివేణి, మానస, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా కింద ప్రతి లబ్ధిదారుడికి సోమవారం పింఛన్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం వింజమూరులోని తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేయాలని తెలిపారు. మొదటి రోజే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. మండల కేంద్రాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తాను, కొండాపురం మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

సంగం: పట్టణంతోపాటు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం పింఛన్ల పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు సంగంలో ఆదివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచే అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి పింఛన్లు పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి చర్యలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో పింఛన్ల పంపిణీకి 8 సచివాలయాల పరిధిలోని సిబ్బందిని సిద్ధం చేసినట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆదివారం తెలిపారు. ఆయా సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అధికారులు నేతృత్వంలో పింఛన్‌దారులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పట్టణంలోని పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని కమిషనర్ తెలిపారు.

అంకమ్మతల్లికి విశేష పూజలు


విశేష అలంకరణలో అంకమ్మతల్లి

ఆత్మకూరు: పట్టణంలోని రజకవీధిలో గ్రామదేవత అంకమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఇటీవల అంకమ్మతల్లి జాతర జరిగిన నేపథ్యంలో 16 రోజుల పండగ సందర్భంగా ఆదివారం అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

అంకాలమ్మతల్లికి పాలపొంగళ్లు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పంచాయతీ మజరా గ్రామమైన వడ్డిపాళెంలో వెలసిన శ్రీరవధూళి అంకాలమ్మతల్లికి భక్తులు ఆదివారం పాల పొంగళ్ల సమర్పించారు. ఉదయం మేకపాటి వంశస్తుల ఇంటి ఇలవేల్పయిన రవధూళి అంకాలమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేకపాటి మాలకొండరాయుడు, మల్లంపాటి గురవయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మాదాల రామచంద్ర, బీజేపీ నాయకుడు మేకపాటి మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

మర్రిపాడు: రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి సోమవారం మర్రిపాడు మండలంలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మర్రిపాడు మండల కేంద్రంతోపాటు డీసీపల్లి గ్రామాల్లో జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఉద్యోగుల సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి


ఆత్మకూరు: ఎంఈఓ నజీర్‌బాషాను సన్మానిస్తున్న మువ్వా రామలింగం తదితరులు


ఉదయగిరి: నారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు: ఉద్యోగులు అందించిన సేవలు శాశ్వతంగా గుర్తుంటాయని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. ఆత్మకూరు మండల విద్యా శాఖాధికారి షేక్ నజీర్‌బాషా ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జేడీ రామలింగం ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం నజీర్‌బాషా ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరి ఎందరో పేద విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, పలువురు ఎంఈఓలు నజీర్‌బాషాను ఘనంగా సన్మానించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏబీసీ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, రవీంద్ర, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ట్రాన్స్‌కో కార్యాలయంలో సీనియర్ లైన్‌మెన్ రేవూరి నారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం కార్యాలయ సిబ్బంది, బంధుమిత్రులు స్థానిక కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.


ఉదయగిరి: నాగేశ్వరరావును సన్మానిస్తున్న మాజీ ఎంఈఓ ఓబుల్‌రెడ్డి

అధ్యాపకునికి సత్కారం

స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహించిన కేసీ కృష్ణయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సహచర ఉద్యోగులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అప్పసముద్రంలో..

అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎం.నాగేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ జి.ఓబుల్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి..

ఉదయగిరి: మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన సత్తెనపల్లి ఓబులేసును పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మన్నేటి వెంకటరెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి, ఎంఈఓ తోట శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు..

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని బోడిపాడు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పెండెం పెంచలనరసయ్య ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, రమేష్‌నాయుడు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు..

మర్రిపాడు: మర్రిపాడు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ దివానపు పెంచలయ్యను విద్యుత్‌శాఖ ఏఈ రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాంపల్లికి చెందిన పెంచలయ్య విధి నిర్వహణలో విశేష సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


వింజమూరులో..


మర్రిపాడు: మాట్లాడుతున్న ఏఈ రామచంద్రయ్య


ఉదయగిరి: ఓబులేసును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


ఆత్మకూరు: లైన్‌మెన్ పెంచలయ్యను సన్మానిస్తున్న దృశ్యం